ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16.06.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పెద్దపల్లి జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

2. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసిరి అనసూయ చెప్పారు.

3. ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

4. వచ్చే 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుండి సాధారణ వర్షపాతం గానీ ఉరుములతో కూడిన జల్లులు కానీ పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

**FASTRACK COURT :** పెద్దపల్లిలో జరిగిన అత్యాచార ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరిత గతిన విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్టు రాష్ట్ర ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి లో రెండు రోజుల కిందట ఆరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటన ప్రదేశాన్ని మహిళా , శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసిరి అనసూయతో కలిసి ఆయన పరిశీలించారు. సంఘటన వివరాలను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన

సమాచారం తెలిసిన వెంటనే పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకుందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఈ సంఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసిరి అనసూయ సీతక్క అన్నారు. డ్రగ్స్ తదితర దురలవాట్లకు గురైన వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ, శాసనసభ్యు లు విజయరమణ , తదితరులు పాల్గొన్నారు. **(PTC)**

**PONNAM PRABHAKAR :** ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీం నగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా చిగురుమామిడి మండల కేంద్రంలో మంత్రి స్థానిక ప్రజలతో ముచ్చటించారు. ప్రజల సమస్యలను త్వరితంగా పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి ఈ మధ్యాహ్నం సైదాపూర్, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటిస్తారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పై మంత్రి సమీక్ష నిర్వహిస్తారు. మంత్రి పర్యటనలో కాంగ్రెస్ పార్టీ గ్రామ , మండల శాఖల అధ్యక్షులు పాల్గొంటున్నారు. **(PTC)**

**PUBLIC HEALTH:** రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీపై దృష్టి పెట్టింది. వివిధ ఆసుపత్రులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు త్వరలో వెలువడే అవకాశాలున్నాయి. ప్రతి వర్షాకాలం రాష్ట్రంలో డెంగీ , ఇతర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) సివిల్ అసిస్టెంట్ సర్జన్ల కొరత ఎక్కువగా ఉంది. సమస్యను అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకుగానూ సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులు 531 భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం

నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు (ఎంహెచ్ఎస్ ఆర్బీ) త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. నియామకాల అనంతరం ఆయా పీహెచ్సీల్లోని డిమాండ్కు అనుగుణంగా సర్జన్లను నియమిస్తారు. 193 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి తెలంగాణ వైద్య విధాన పరిషత్ త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అలాగే, వివిధ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు అందించే స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయనున్నారు. 31 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తుంది. **(PN)**

**SRISAILAM:** ఈ సీజన్ లో తొలిసారి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం మొదలైంది.. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు , లక్షలాది ఎకరాలకు తాగు , సాగు నీరు అందించే శ్రీశైలం , నాగార్జున సాగర్ ప్రాజెక్టు లు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరాయి.. దీంతో నీటి లభ్యతకు కష్టమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.. ప్రస్తుత పరిస్థితులలో కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం మొదలైంది.. ఎగువన ఉన్న సుంకేసుల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం కు 8,622 క్యూసెక్కుల వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్టు 811.90 అడుగులకు చేరింది.. దిగువన ఉన్న సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 505.50అడుగుల నీరు ఉంది.. డెడ్ స్టోరేజికన్నా 5అడుగుల నీరు తక్కువగా ఉండటం తో హైదారాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం ఎసెల్బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటకు వదులుతున్నారు.. జులై లో వచ్చే వరదల తో శ్రీశైలం , నాగార్జున సాగర్ పూర్తి స్థాయిలో నిండే అవకాశాలు ఉన్నట్లు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.**(PTC)**

**NIRMAL DRDO :** నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. నిన్న రాత్రి హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో మంత్రి ధనసిరి అనసూయ సీతక్క, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా ఆమెకు

పురస్కారాన్ని అందించి అభినందించారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘ సభ్యుల వార్షిక రుణ లక్ష్యం రూ.403 కోట్లు కాగా , రూ.411 కోట్లు పంపిణీ చేశారు. రుణాలను సైతం వసూలు చేసి రాష్ట్రంలో జిల్లా రెండవ స్థానంలో నిలవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. తనతో పాటు పనిచేసిన వారందరి సామూహిక కృషి కారణంగానే ఈ అవార్డు సాధించామని విజయలక్ష్మి పేర్కొన్నారు. **(PTC)**

**WEATHER-TELANGANA:** వచ్చే 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుండి సాధారణ వర్షపాతం గానీ ఉరుములతో కూడిన జల్లులు కానీ పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాదు , కొమరం భీం ఆసిఫాబాద్ , మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలున్నట్టు పేర్కొంది. ఈ జిల్లాలతో పాటు కరీంనగర్ , పెద్దపల్లి , జయశంకర్ భూపాలపల్లి , యాదాద్రి భువనగిరి , రంగారెడ్డి, హైదరాబాదు, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం వివరించింది.**(PN)**

**ANGANWADI :** అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులను ఆకర్షించాలని ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం నుంచి చిన్నపిల్లలకు యూనిఫామ్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 587 అంగ న్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 17 ,137 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు.. వీరిలో 8 ,302 బాలికలు, 8,832 మంది బాలురు అంగన్వాడీ కేంద్రాల సేవలు పొందుతున్నారని వీరికి సంబంధించిన యూనిఫామ్స్ వారం రోజుల్లో జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయని తెలిపారు. ముందుగా ప్రతీ చిన్నారికి ఒక జత చొప్పున పంపిణి

చేస్తామని, దుస్తులు రాగానే వాటిని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. **(PTC)**

**LEGAL SERVICES:** వివిధ కేసులకు సంబంధించి బాధితులకు అందజేసే పరిహారంపై పోలీస్ అధికారులతో పాటు జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆసిఫాబాద్ జిల్లా అదనపు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. బాధితులకు వివిధ కేసులకు సంబంధించి అందజేసే నష్టపరిహారంపై పోలీస్ అధికారులు , జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులలో బాధితులకు త్వరగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని సూచించారు. మహిళలకు నష్టపరిహారం ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సంక్షేమ శాఖ అధికారులతో , పోలీసులు సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ కార్యాలయంలో కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.**(PTC)**

**PCPN DT ACT :** పీసీపీఎన్ డీటీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ వో ఎస్. రజిత పేర్కొన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగిన వారు , అడగమని ప్రోత్సహించిన వారు, చెప్పిన వారికి చట్టప్రకారం 3 సంవత్సరాల జైలు శిక్ష , రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసు కుంటామని , పీసీపీ ఎన్డీటీ యాక్ట్ ప్రకారం అన్ని వివ రాలు నమోదు చేయాలని , లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్ప వని పేర్కొన్నారు.**(PTC)**

**SCERT :** రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ- SCERT డైరెక్టర్ గా జి. రమేశ్ నిన్న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు సంచాలకుడిగా పని చేస్తున్న రమేశ్ ను ప్రభుత్వం ఎస్.సి.ఇ. ఆర్. టి. డైరెక్టర్ గా బదిలీ చేసింది. ఇప్పటివరకు

ఎస్.సి.ఇ. ఆర్. టి. డైరెక్టర్ గా ఉన్న రాధారెడ్డి సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు సంచాలకురాలిగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా ఉన్న రమణ కుమార్ పాఠ్యపుస్తక ముద్రణా విభాగం సంచాలకుడిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని ప్రభుత్వం పేర్కొంది. **(DESK)**

**JANAGAON-PHC:** ఈనెల 20న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనగామ జిల్లా కోమల్ల పిహెచ్ సి వైద్యాధికారి మధుకర్ యాదవ్ కోరారు. జిల్లాలోని రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై ఈరోజు అవగాహన సమావేశం నిర్వహించారు. అల్బెండజోల్ మాత్రల పంపిణీపై సిబ్బందికి సూచనలు చేశారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసులోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ అవగాహన సమావేశంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి సినారాణి, వైద్యులు నమ్రత, ప్రమీల, జిలాని తదితరులు పాల్గొన్నారు.**(PTC)**

**SADARAM:** సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జనగామ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మొగులప్ప సూచించారు. ఈనెల 20, 27, 28 తేదీలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నందు వల్ల జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాలలో రేపు సదరం స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. అర్హులైన దివ్యాంగులు డాక్టర్ రిపోర్ట్స్ , ఆధార్ కార్డు, ఫోటో, మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకున్న రసీదులను వెంట తెచ్చుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు హాజరు కావాలని డి ఆర్ డి ఓ మొగులప్ప చెప్పారు.**(PTC)**